అర్చకుడు, ఈవోపై చర్యలు తీసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, మార్చి 24 : మడికొండ మెట్టు రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించే డబ్బులు, బంగారం, వెండి అధికారులకు ఇవ్వకుండా నేరుగా తీసుకెళ్తున్న అర్చకుడు రాగిచేడు అభిలాష్ శర్మ, ఈవో శేషుభారతిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్, దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ చీకటి రాజు డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. డీసీ శ్రీకాంతరావు విచారణలో అభిలాష్‌శర్మ 15 కిలోల వెండి దేవాలయానికి ఇవ్వకుండా తన దగ్గరే పెట్టుకున్నాడని, దేవాదాయ ధనం నేరుగా తీసుకున్నాడని ఉన్నతాధికారులకు ఫైల్ పంపించారని, ఈ విషయం బయటకు రాకుండా డీసీని ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించినట్లు వారు తెలిపారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అర్చకుడు అభిలాష్, ఈవో శేషుభారతిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

హనుమకొండ చౌరస్తా, మార్చి 24 : చారిత్రాత్మక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి అనిల్‌కుమార్, ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, సందీప్‌శర్మ, మణికంఠశర్మ అవధాని, సీనియర్ అసిస్టెంట్ మధుకర్ ఉగాది, శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. ఈ నెల 30న ఉగాది పండుగ సందర్భంగా రుద్రేశ్వరునికి రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. రూ.2,116 చెల్లించి హోమంలో పాల్గొనాలని చెప్పారు. శ్రీరామ నవమి సందర్భంగా 6న జరిగే స్వామి వారి కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.1,116 చెల్లించాలన్నారు.

ఇంటర్ మూల్యాంకనంలో మార్పులు

హనుమకొండ చౌరస్తా, మార్చి 24 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మూల్యాంకన కేంద్రం క్యాంపు నంబర్-20లో కెమిస్ట్రీ, కామర్స్ సమాధాన పత్రాల మూల్యాంకనం ఈ నెల 26కు బదులుగా 25వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని డీఐఈవో గోపాల్ తెలిపారు. అదేవిధంగా 28న ప్రారంభమయ్యే హిస్టరీ కూడా 25వ తేదీకి మార్చామని, అన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లు మూల్యాంకన విధులు కేటాయించిన అధ్యాపకులను విధిగా రిలీవ్ చేయాలని ఆదేశించారు.

రైల్వే బాక్స్ బాయ్‌లకు జీతాలు అందక పస్తులు

కాజీపేట, మార్చి 24 : సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని కాజీపేట రైల్వే క్రూ కంట్రోల్ కార్యాలయంలో రైలు డ్రైవర్లు (ఎల్సీ, ఏఎల్పీ), గార్డు (ట్రైన్ మేనేజర్)ల లైన్ బాక్స్‌లు అందించే కాంట్రాక్టు బాక్స్‌బాయ్‌లకు కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ సభ్యులు పస్తులు ఉంటూ దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారు. బాధితుడు మాట్ల ఆంజయ్య సోమవారం మాట్లాడుతూ.. కాజీపేట రైల్వే క్రూ కంట్రోలర్ పరిధిలోని దాదాపు 700లకు పైగా ఉన్న రైలు డ్రైవర్లు, గార్డులకు లైన్ బాక్సులు అందించే కాంట్రాక్టును గత ఏడాది రైల్వేశాఖ బీహార్‌కు చెందిన నిరంజన్ కుమార్‌కు ఇచ్చింది. దీంతో ఆ కాంట్రాక్టర్ లైన్ బాక్సులను అందించేందుకు కాజీపేటకు చెందిన ముగ్గురిని నెలకు రూ.8000 జీతం ఇస్తానని కాంట్రాక్టు లేబర్‌గా పనిలో పెట్టుకున్నాడు. కాగా, సదరు కాంట్రాక్టర్ 2023 డిసెంబర్ నుంచి, 2024 ఆగస్టు (9 నెలలు) వరకు బాక్స్ బాయ్‌లకు రైల్వేశాఖ బిల్లు ఇవ్వలేదనే సాకుతో జీతాలు ఇవ్వకుండా తిప్పించుకున్నాడు. కొంతకాలంగా బాక్స్‌బాయ్‌ల ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు. ఈ విషయాన్ని రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. సంబంధిత రైల్వే అధికారులు ఇప్పటికైనా స్పందించి బాక్స్‌బాయ్‌లకు జీతం ఇప్పించి, తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

బహిరంగ ప్రకటన
డిబిల్ అగ్రిసైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్

డిబిల్ అగ్రిసైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున మరియు సూచనల మేరకు ఈ పత్రికా ప్రకటన జారీ చేయబడినది. తెలంగాణ అంతటా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్రాలు మరియు ఇతర వ్యవసాయ సామాగ్రి వ్యాపారాన్ని కొనసాగిస్తున్న కంపెనీ అయిన డిబిల్ అగ్రిసైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ అంతర్గత ఆడిట్‌లో స్టాక్ కౌంట్స్‌లో కవర్ చేయబడని వ్యత్యాసాలు మరియు ఒకే వ్యక్తికి చెందిన అనధికృత ఆర్థిక లావాదేవీలు కనుగొనబడినందున ఈ స్టేట్‌మెంట్ జారీ చేసినది.

జరిగిన అక్రమ లావాదేవీలకు సదరు వ్యక్తి పూర్తి బాధ్యత వహిస్తున్నట్లు ఒప్పుకున్నారు. కంపెనీతో పరిష్కారాలు రాజీకి ఏకీభవించారు. ఈ యొక్క పరిణామం కంపెనీ సమగ్రతకు, విలువలకు చిహ్నం కాదు.

డిబిల్ పారదర్శకత, చిత్తశుద్ధి మరియు మోసం కొరకు జీరో-టాలరెన్స్ పాలసీకి కట్టుబడి ఉంటుంది. సదరు కంపెనీ ఉద్యోగులు మరియు వినియోగదారుల మధ్య అనధికృత లావాదేవీలకు ఎలాంటి బాధ్యత వహించదు, దీనికి వారే బాధ్యులు. ఈ విషయం కంపెనీ పేరు ప్రతిష్టలు మరియు కార్యకలాపాలను ప్రభావితం చేయదు మరియు డిబిల్ నైతిక వ్యాపార పద్ధతులు మరియు క్రమబద్ధం చేసే నిబద్ధతను కొనసాగిస్తుంది.

డిబిల్ అగ్రిసైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్
సి.వి.రావంత్, అడ్వకేట్
అల్లాడి లా చాంబర్స్
215, లేన్ నెం. 6, ఎమ్మెల్యే కాలనీ,
బంజారాహిల్స్, హైదరాబాద్,
తెలంగాణ-500 034, **9646916666.**

సమస్యలతో వచ్చాం.. పరిష్కరించండి

- గ్రీవెన్స్‌లో బాధితుల మొర
- దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి
- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ, మార్చి 24 : సమస్యలతో వచ్చాం.. పరిష్కారం చూపాలని బాధితులు మొర పెట్టుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 120 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో తహసీల్దార్ కార్యాలయాలకు సంబంధించి 32, జీడబ్ల్యూఎంసీ 25, ఎంపీడీవో కార్యాలయాలు 11, డీపీవో 6, హనుమకొండ ఆర్డీవో 5, పరకాల ఆర్‌డీవో 3, ఇరిగేషన్ ఎస్ఈ 3, డబుల్ బెడ్‌రూం 3, డీఎంహెచ్‌వో మూడుతో పాటు మిగిలినవి ఇతర శాఖలకు చెందిన అర్జీలు ఉన్నాయి. కాగా, గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గణేశ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, ఆర్డీవోలు రాథోడ్ రమేశ్, నారాయణ పాల్గొన్నారు.

జీవనోపాధి కల్పించాలి..

తమకు జీవనోపాధి కల్పించాలని హనుమకొండ మచిలీబజార్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నాయకులు గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. తమ సంఘంలో 410 మంది సభ్యులు ఉన్నారని, తామంతా భద్రకాళీ చెరువులో చేపలు పట్టుకొని కుటుంబాలను పోషించుకుంటున్నామని చెప్పారు. గత సంవత్సరం నవంబర్ 14న చెరువులోని నీటిని ఖాళీ చేసి జీవనోపాధి లేకుండా చేశారని, ఆరు నెలల్లో మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పనులే ప్రారంభించలేదన్నారు. అదే విధంగా సిద్ధ సముద్రం, కొమ్మలకుంట, తెప్పకుంటలు కబ్జాకు గురయ్యాయని, భద్రకాళీ చెరువుకు మరమ్మతులు పూర్తి చేసే వరకు తమకు జీవనోపాధి కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

మా గ్రామానికి రోడ్లు వేయించండి..

ఐనవోలు : తమ గ్రామానికి బీటీ రోడ్లు వేయించాలని కోరుతూ కొండపర్తి గ్రామానికి చెందిన కట్కూరి సురేశ్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశాడు. కొండపర్తి నుంచి భట్టుపల్లి, మామునూరు, ఐనవోలు గ్రామాలకు రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, గత ప్రభుత్వం హయాంలో బీటీ రోడ్ల పనులు ప్రారంభించినా ఇప్పటివరకు పూర్తి కాలేదని, దుమ్ము, ధూళి వల్ల శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయని అందులో పేర్కొన్నాడు. గతుకుల రోడ్లపై ప్రయాణం చేస్తుంటే వాహనాలు రిపేరుకు వస్తున్నాయని, విద్యార్థులు, ఉద్యోగులకు కష్టంగా మారిందని, కలెక్టర్ చొరవ తీసుకొని కొండపర్తి గ్రామానికి మూడు వైపులా బీటీ రోడ్లు పూర్తి చేయించాలని వినతిపత్రంలో కోరాడు.

ఎస్వీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

విద్యార్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న చైర్మన్ తిరుమల్‌రావు

హసన్‌పర్తి, మార్చి 24 : భీమారంలోని ఎస్వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్‌లో సోమవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈసీఈ విభాగం నుంచి 23 మంది, ఈఈఈ విభాగం నుంచి 18 మంది విద్యార్థులు చెన్నైలోని స్వింగార్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీలో ఉద్యోగాలు సాధించినట్లు విద్యా సంస్థల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 41 మంది ఉద్యోగాలు సాధిండంపై ఆనందం వ్యక్తం చేశారు. ఇండస్ట్రీ ఇంటరాక్షన్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.

సుమతీరెడ్డిలో వర్క్‌షాపు ప్రారంభం

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీకాంత్

హసన్‌పర్తి, మార్చి 24 : అనంతసాగర్ శివారులోని సుమతీరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ విభాగం సినర్జీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే నాస్కామ్ డిజిటల్ 101 ప్రోగ్రాం, ఐబీఎం స్కిల్ బిల్డ్-కృత్రిమ మేధస్సు అంశంపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. పరికిపండ్ల శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ వీరబధిని, వివిధ విభాధిపతులు కే మహేందర్, ఈ సుదర్శన్, ఎన్ శ్రీవాణి, ఏవో వేణుగోపాలస్వామి పాల్గొన్నారు.

బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలి

నయీంనగర్, మార్చి 24 : కేసీఆర్‌పై అసత్య ఆరోపణలు చేసిన బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని కేయూ పోలీసు స్టేషన్ సీఐ రవి కుమార్‌కు బీఆర్ఎస్వీ నాయకులు దరఖాస్తు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బండి సంజయ్ కేంద్రమంత్రిలా ప్రవర్తించడం లేదని, ఇష్టంవచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిట్‌ను సందర్శించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

హనుమకొండ చౌరస్తా, మార్చి 24 : నిట్‌ను జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోతు హుస్సేన్‌నాయక్ సందర్శించారు. డైరెక్టర్ బిద్యాధర్ సుబుధితో కలిసి వివిధ విభాగాల అధికారులు, ఎస్టీ అసోసియేషన్ టీచింగ్ స్టాఫ్, స్టూడెంట్స్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది సమస్యలపై చర్చించారు. భోజన శాల, వసతి గృహాలు, లైబ్రరీని సందర్శించారు.

విధుల్లో చేరిన ఇన్‌చార్జి డీటీసీ పురుషోత్తం

నయీంనగర్, మార్చి 24 : ఇన్‌చార్జి డీటీసీగా పెద్దింటి పురుషోత్తం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండ డీటీసీ పుష్పాల శ్రీనివాస్ ఇంట్లో గత నెల 7న ఏసీబీ దాడులు నిర్వహించి ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని గుర్తించి ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో కరీంనగర్ డీటీసీగా పని చేస్తున్న పురుషోత్తంకు హనుమకొండ జిల్లా ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగిస్తూ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్‌హెచ్ఆర్సీ జిల్లా సెక్రటరీగా మధుసూదన్

నయీంనగర్, మార్చి 24 : జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా జనరల్ సెక్రటరీగా ఆడెపు మధుసూదన్‌ను నియమిస్తూ సోమవారం రాష్ట్ర చైర్మన్ బీ శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి మధుసూదన్ కృతజ్ఞతలు తెలిపారు.

గూడెప్పాడ్‌లో రెండు వేల కోళ్లు మృతి

గూడెప్పాడ్‌లో మృతి చెందిన కోళ్లను గుంత తీసి పడేసిన ఫారం యజమాని

ఆత్మకూరు, మార్చి 24 : గూడెప్పాడ్ గ్రామంలోని కోళ్లఫామ్‌లో ఆదివారం రాత్రి 2 వేలకు పైగా కోళ్లు మృతి చెందాయి. వాటిని కోళ్ల ఫాం యజమాని గ్రామంలోని పంట పొలంలో గుంత తీసి పూడ్చేయకుండా నిర్లక్ష్యంగా పడేశాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆ కోళ్లను వీధి కుక్కలు తిన్నాయని, అవి గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. జీపీ అధికారులు చొరవ తీసుకొని కుక్కలను పట్టుకొని తరలించాలని కోరుతున్నారు. కాగా, మృతిచెందిన కోళ్ల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామని పశు వైద్యాధికారి ధర్మానాయక్ తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు కోసం కృషి చేయాలి : మేయర్ గుండు సుధారాణి

కొబ్బరిబోండాల ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్, మార్చి 24 : స్వచ్ఛ సర్వేక్షణ్ - 2024లో గ్రేటర్ కార్పొరేషన్ మెరుగైన ర్యాంకు కోసం కృషి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. త్వరలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం నగరంలో పర్యటించనున్న తరుణంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సోమవారం ఆమె బాలసముద్రంలోని కోక్ పిట్, వర్మీ కంపోస్ట్ యూనిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొబ్బరిబోండాల ప్రాసెసింగ్ యూనిట్‌ను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కొబ్బరి పీచు మ్యాట్‌లు హార్టికల్చర్ విభాగానికి ఉపయోగపడుతాయని చెప్పారు. ఈ యూనిట్ ద్వారా పది మహిళా సంఘాల సభ్యులు ఉపాది పొందుతున్నారన్నారు. వినియోగించిన కొబ్బరిబోండాలు కోక్‌పిట్ యూనిట్‌కు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్‌సీ సెంటర్‌ను పరిశీలించి ప్రతి రోజూ టన్ను పొడి చెత్త వచ్చేలా చూడాలన్నారు. వర్మీ కంపోస్ట్ యూనిట్‌ను సందర్శించారు. బాలసముద్రంలోని బయో మిథనైజేషన్ ప్లాంట్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో రాజారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి, అనిల్, వావ్ ప్రతినిధి పవన్ పాల్గొన్నారు.

కేశవమూర్తికి ప్రెస్‌క్లబ్ కమిటీ సన్మానం

హనుమకొండ చౌరస్తా, మార్చి 24 : గోవాలో జరిగిన 47వ భారత మాస్టర్స్ (వెటరన్) నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ పూర్వ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తిని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య సన్మానించారు. వెటరన్ విభాగం-55 ప్లస్‌లో గడ్డం కేశవమూర్తి గుజరాత్, రాజస్థాన్ జట్టు క్రీడాకారులను సునాయాసంగా ఓడించారని, జాతీయస్థాయి మెయిన్ డ్రాలో ప్రవేశించి జార్ఖండ్ జట్టు క్రీడాకారులపై 21-13, 21-11 స్కోరుతో విజయం సాధించినట్లు తెలిపారు.

సీపీని కలిసిన ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్

సుబేదారి, మార్చి 24 : వరంగల్ ససీపీ సన్‌ప్రీత్ సింగ్‌ను పబ్లిక్ ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ సంతోషిణి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో సీపీని కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నేరానికి పాల్పడిన వారికి శిక్ష పడేందుకు కృషి చేసి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. సీపీని కలిసిన వారిలో అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళీధర్‌రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవికిరణ్, బృంద, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పావని, దుర్గాబాయి ఉన్నారు.

వెంకటాపురం కారోబార్‌పై చర్యలు?

ఐనవోలు, మార్చి 24 : వెంకటాపురం కారోబార్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు డీపీవో ఉత్తర్వులు జారీ చేసిన మెమో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వెంకటాపురం గ్రామంలోని తమ్మరపల్లి శివాజీకి ఒకే సంవత్సరం రెండు ఇంటి పన్నుల రసీదులు జారీ చేసిన అంశంపై ఫిర్యాదు మేరకు మండలాధికారులు విచారణ జరిపారు. నివేదిక పరిశీలించిన డీపీవో తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు కారోబార్‌ను గ్రామ పంచాయతీ విధుల్లోకి తీసుకోవద్దని మండల పంచాయతీ అధికారిని ఆదేశించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎంపీడీవో, ఎంపీవో వివరణ కోరగా దీనికి సంబంధించిన ఎటువంటి మెమో రాలేదని తెలిపారు.

వంగపల్లిలో వరుస చోరీలు

కమలాపూర్, మార్చి 24 : మండలంలోని వంగపల్లి గ్రామంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. దేవరాజు శంకరయ్య, దేవరాజు భద్రయ్య ఇళ్లల్లో ఇరవై రోజుల క్రితం చోరీ జరిగింది. అప్పుడు శంకరయ్య ఇంట్లో రూ.లక్ష నగదు, భద్రయ్య ఇంట్లో 3తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. సోమవారం మళ్లీ దేవరాజు శంకరయ్య ఇంటి తలుపులు తీసేసి గుర్తు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న రూ.4వేల నగదు ఎత్తుకెళ్లారు. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడేశారు. అలాగే కమలాపూర్ శివారులో ఎస్సారెస్పీ కాల్వకు పెట్టిన మోటర్లు, శనిగరం వాగులో పెట్టిన మోటర్లను దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితులు చెప్పారు. ఓ వైపు ఇళ్లలో చోరీ, మరో వైపు రైతుల మోటర్లు ఎత్తుకెళ్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

డీఈఈఈ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ చౌరస్తా, మార్చి 24 : డిప్లామా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఎల్ఈడీ), డిప్లామా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ)లో ప్రవేశాలకు డీఈఈఈ సెట్-2025 నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రభుత్వ డైట్ వరంగల్ ప్రిన్సిపాల్ ఎండీ అబ్దుల్‌హై ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి మే 15వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశపరీక్ష మే 25న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్‌లో 50 శాతం మార్కులు సాధించిన వారు, 45 శాతం మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు https://deeset.cdse.telanganagovt.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

గ్రీవెన్స్ వినతులకు సత్వర పరిష్కారం చూపాలి

- గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మార్చి 24 : గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చిన వినతులకు సత్వర పరిష్కారం చూపాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో ఆమె ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. 29వ డివిజన్‌లోని మోక్షారామం హిందూ శ్మశాన వాటిక ప్రహరీ ఏడాది క్రితం కూలిపోయిందని, మళ్లీ నిర్మించాలని, రామన్నపేటలోని దళిత శ్మశాన వాటికలో కనీస వసతులు కల్పించాలని డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సదాంత్ వినతిపత్రం అందజేశారు. 15వ డివిజన్ గొర్రెకుంటలోని సుప్రియ కోల్డ్ స్టోరేజ్‌లో కమర్షియల్ నల్లా కనెక్షన్ కోసం 2024లో దరఖాస్తు చేసుకున్నా, ఇప్పటి వరకు కనీసం వెరిఫికేషన్‌కు రాలేదని కోల్డ్ స్టోరేజ్ యాజయాని బత్తిని మోహన్ రావు ఫిర్యాదు చేశారు. 50వ డివిజన్ పరిధిలో కుక్కల బెడద తీవ్రంగా ఉన్నదని, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికుడు శ్రీనివాస్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. 64వ డివిజన్‌లోని గ్రీన్‌హిల్స్ అపార్ట్‌మెంట్ నుంచి వ్యర్థాలు, చెత్తను రోడ్లు, అపార్ట్‌మెంట్ పక్కన వేయడంలో ఇబ్బందులు పడుతున్నామని, వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరారు. 8వ డివిజన్ ఏనుగుల గడ్డ ప్రాంతంలో కుంభం సత్యనారాయణ రెడ్డి మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మాణం చేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ లక్ష్మీకుమారి ఫిర్యాదు చేశారు. అనంతరం కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ.. గ్రీవెన్స్ వినతుల పరిష్కారంలో శ్రద్ధ పెట్టాలన్నారు. గ్రీవెన్స్‌లో 103 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 45, ఇంజినీరింగ్ విభాగం 16, ప్రజారోగ్య విభాగం 15, పన్నుల విభాగం 20, తాగునీటి సరఫరాపై 7 వినతులు వచ్చాయి. గ్రీవెన్స్‌లో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, బయాలాజిస్ట్ మాధవరెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పంటల వివరాలు నమోదు చేయాలి : కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, మార్చి 24 : యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకు నమోదు కాని పంటల వివరాలను శనివారం నాటికి తప్పనిసరిగా నమోదు చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. హార్వెస్టర్ యజమానులతో ఆర్డీవోలు, రవాణా శాఖ అధికారులు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు మూడు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఫిర్యాదులు వస్తున్నచోట్ల తూనికలు కొలతల శాఖ అధికారులు తూకాలను తనిఖీ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రాల ఇన్‌చార్జులు ట్యాబ్‌లను మూడు, నాలుగు రోజుల్లోగా సిద్ధం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఎప్పుడైనా రావొచ్చన్నారు. గతంలో మాదిరిగా సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు ఒకే కేంద్రం వద్ద ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, నీడ కోసం షేడ్ నెట్, ధాన్యం క్లీనింగ్ కోసం విద్యుత్ సదుపాయం కల్పించాలన్నారు. సన్న రకం ధాన్యం బస్తాలపై తప్పనిసరిగా స్టెన్సిల్స్ వేయాలన్నారు. మిల్లర్లతో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, పౌరసరఫరాల శాఖ అధికారి కొమురయ్య, సివిల్ సప్లయ్ డీఎం మహేందర్, ఎల్‌డీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్తమ వైద్య సిబ్బందికి ప్రశంసాపత్రాలు

శాయంపేట : ప్రశంసాపత్రం అందుకుంటున్న చలపతి

దామెర/శాయంపేట : మండలంలోని కోగిల్వాయి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశ వర్కర్‌గా విధులను నిర్వర్తిస్తున్న కే రజినీకి సోమవారం కలెక్టర్ ప్రావీణ్య బెస్ట్ ఆశ వర్కర్ ప్రశంసాపత్రం అందజేశారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా కేఎంసీలో జరిగిన కార్యక్రమంలో రజినీ ప్రశంసాపత్రం అందుకున్నారు. రజినీని పీహెచ్‌సీ డాక్టర్ మంజుల, ఎంపీహెచ్ఈవో అశోక్‌బాబు, సూపర్‌వైజర్ శ్రీకాంత్ అభినందించారు.